

కార్యక్రమంలో పాల్గొన్న మంచు మనోజ్, మౌనిక దంపతులు

## పిల్లలు ఆడుకునే దేశీయ బొమ్మలు

ఖైరతాబాద్, డిసెంబర్ 25 : దేశీయంగా తయారు చేసిన పిల్లలు ఆడుకునే బొమ్మల ప్రదర్శనను 'నమస్తే వరల్డ్' పేరుతో ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లో ఏర్పాటు చేశారు. దీనిని సినీ నటుడు మంచు మనోజ్, మౌనిక దంపతలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిలయెన్స్ అధినేత ముఖేష్ అంబానీతో కలిసి ముంబయిలోని జీయో వరల్డ్‌లో స్థాపించామని, హైదరాబాద్ నగరవాసులకు పరిచయం చేయడానికి ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు ఆడుకునే వివిధ రకాల బొమ్మలతో పాటు కార్టూన్ సిరీస్‌కు సంబంధించిన టాయ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.



### మనుస్మృతి ప్రతుల దహనం..

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు చెరుకు రాంచందర్, ప్రభాకర్, సత్యనారాయణ, మల్లేశ్, కాశీనాథ్, కనకయ్య, యాదయ్య, తదితరులు

**- కవాడిగూడ, డిసెంబర్ 25**



నాటక మంజరి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు.

## నాటక మంజరి పుస్తకాల ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 25 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రబంధ నాటక మంజరి, ప్రసిద్ధ నాటక మంజరి, ఏకపాత్రాభినయ మంజరి పుస్తకాలు, శారద గీతాలు ఆల్బమ్ ఆవిష్కరణోత్సవం ఘనంగా జరిగింది. ప్రముఖ రచయిత మల్లాది సూర్యకిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆకాశవాణి విశ్రాంత డిప్యూటీ డైరక్టర్ జనరల్ మంగళగిరి ఆదిత్యప్రసాద్, ప్రముఖ సాహితీవేత్తలు ఓలేటి పార్వతీశం, ఏ.మల్లయ్య, నటులు ఉప్పలూరి సుబ్బరాయశర్మ పాల్గొని ఆవిష్కరించారు. సాహితీవేత్త సోమంచి రామకృష్ణ విఠల్ నిర్వహణలో పలువురు సాహితీవేత్తలను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా శారద గీతాలు ఆల్బమ్ సంగీత దర్శకులు భాగి నారాయణశాస్త్రి నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను ఓలలాడించింది.




తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2024 డైరీ, క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యనిర్వాహకవర్గ సమావేశంలో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఏవీఎన్ రెడ్డి, ఆర్ఎస్సెఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, రాష్ట్ర సహాధ్యక్షుడు పాపిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య తదితరులు

**- హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)**



ఎన్టీఆర్ మార్గ్‌లో పర్యాటకులు పెరగడంతో వాహనాల రద్దీ

# సాగరతీరంలో పర్యాటకుల సందడి

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : వరుస సెలవులతో నగరంలోని పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ చుట్టూ పలు పార్కులు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం, సోమవారం క్రిస్మస్ ఉండడంతో వరుస సెలవులు వచ్చాయి. దీంతో లుంబినీ పార్కు నుంచి మొదలు ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, జలవిహార్ పక్కన ఉన్న లేక్ ఫ్రంట్ వ్యూ పార్కు, సంజీవయ్య పార్కు, ట్యాంక్‌బండ్ ప్రాంతాలన్నీ రెండు రోజుల నుంచి పర్యాటకులతో నిండిపోయాయి. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అమరవీరుల స్మారక చిహ్నం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయం.. హుస్సేన్‌సాగర్‌ను అనుకొనే ఉండడంతో ఈ ప్రాంతమంతా పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. లుంబినీ పార్కులో నుంచి హుస్సేన్‌సాగర్ లోపల ఉన్న బుద్ధ విగ్రహాన్ని చూసేందుకు కూడా పర్యాటకులు ఆసక్తి చూపారని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ అధికారులు తెలిపారు. ఆదివారం ఒక్క రోజే 20 వేల మందికి పైగా లుంబినీ పార్కు, ఎన్టీఆర్ గార్డెన్ లోపలికి వచ్చారని, అదేవిధంగా కొత్తగా ప్రారంభమైన లేక్ ఫ్రంట్ వ్యూ పార్కుకు 10 వేల మంది సందర్శకులు వచ్చారని, సోమవారం సైతం అదే స్థాయిలో సందర్శకుల తాకిడి హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న పార్కుల్లో ఉందని తెలిపారు.

### గండిపేట పార్కులోనూ..

జంట జలశయాల్లో ఒకటైన గండిపేటలో హెచ్ఎండీఏ నిర్మించిన లేక్‌వ్యూ పార్కును నగర వాసులు ఎక్కువగా సందర్శిస్తున్నారు. సెలవు రోజుల్లో 10వేల మంది సందర్శకులు గండిపేట పార్కుకు వస్తున్నారని, క్రిస్మస్ సెలవులు కావడంతో రద్దీ మరింత పెరిగిందని పార్కు నిర్వాహకులు తెలిపారు.



## తెలంగాణ స్విమ్మింగ్ టీమ్

బెంగళూరు వేదికగా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే 34వ సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనున్న తెలంగాణ స్విమ్మింగ్ టీమ్. జోర్డాన్ డొమినిక్, అదితి, విరించిరెడ్డి ఆయా విభాగాలకు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.

### హాకీ ఆటగాళ్లకు ఆర్థిక సాయం




ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న హాకీ ప్లేయర్లు అరుణ్, తరుణ్‌కు సోమవారం హాకీ సామగ్రి కొనుగోలుకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న తెలంగాణ హాకీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్

**- హైదరాబాద్, ఆట ప్రతినిధి**

## జేఎన్‌టీయూకు పూర్వ విద్యార్థుల చేయూత

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ విద్యా విధానంలో నాణ్యతను పెంచేందుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నది. ఇందుకోసం పూర్వ విద్యార్థుల సహకారాన్ని కూడా తీసుకుంటున్నది. జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్, ఎంబీఏ వంటి కోర్సులు పూర్తి చేసి, దేశ విదేశాలలో స్థిరపడిన వారు, సీఈవోలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్, పారిశ్రామిక, రాజకీయ నాయకులుగా ఎదిగిన వారందరినీ ఏక తాటిమీదకు తీసుకువస్తుంది. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల జేఎన్‌టీయూ గ్లోబల్ అల్యూమ్నీ మీట్-2023 నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు విరాళాలు ఇచ్చారు. కంప్యూటర్లు, ల్యాబ్ పరికరాలు, అకడమిక్ సహకారం, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు కావాల్సిన సౌకర్యాలు, అసిస్టెన్సీతో పాటు దేశ విదేశాలకు చెందిన పలు ఉన్నత స్థాయి యూనివర్సిటీలతో పరస్పర అవగాహనలు ఏర్పాటు చేయడంలో పూర్వ విద్యార్థుల పాత్ర గొప్పగా ఉంటుందని ఆ యూనివర్సిటీ అధికారులు చెప్పుతున్నారు. యూనివర్సిటీ అభివృద్ధిని ఎంతో కొంత సాయం చేయాలన్న కాంక్షతోనే పూర్వ విద్యార్థులందరూ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని ఆ యూనివర్సిటీ వీసీ అన్నారు.

# గ్రేటర్‌లో ప్రజాపాలనపై సమీక్ష




సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమంపై గ్రేటర్ అధికారులతో మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ఆరు గ్యారంటీ పథకాలను అందించేందుకు వార్డుల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో షెడ్యూల్ సమాచారాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వార్డులోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని, ఒక్కో ప్రాంతంలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. అర్జిదారులు ఎక్కువగా ఉంటే అదనంగా మరికొన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. 600 లోకేషన్లలో 5వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, మరో 5వేల మంది వలంటర్లతో ప్రజాపాలనకు సన్నాహాలు చేసినట్లుగా వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.